# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- వరద బాధితులకు సహాయం అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయిలో పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈరోజు అధికారులతో సమీక్ష నిర్వహించారు.
- మహిళలు, బాలికల భద్రత లక్ష్యంగా ప్రత్యేక విమెన్ సేఫ్టీ సెల్ ను ఈరోజు అనకాపల్లిలో ప్రారంభించారు.
- వాయువ్య బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

వరద బాధితులకు సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయిలో పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈరోజు ఆయన విజయవాడలో పాత్రికేయులతో మాట్లాడుతూ... వరద ప్రభావిత ప్రాంతాల్లో 62 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, 2 వేల మందికి పైగా పారిశుద్ధ్య సిబ్బంది పని చేస్తున్నారని పేర్కొన్నారు. భారీ వాహనాల ద్వారా పెద్ద ఎత్తున వ్యర్థాలను తొలగిస్తున్నామని, అగ్నిమాపక యంత్రాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని వివరించారు. వరద ప్రభావిత ప్రాంతంలోని అన్ని సచివాలయాలకు ఇన్‌ఛార్జిలుగా సీనియర్ అధికారులను నియమించామని, 32 మంది ఐఏఎస్ అధికారులు సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఆహారం, తాగునీరు, పాల పేకెట్లు, మందులు అందజేస్తున్నామని తెలిపిన ఆయన.. నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర మంత్రి అమిత్ షాతో మాట్లాడి, వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాల్సిందిగా కోరినట్టు తెలిపారు. విజయవాడ, అమరావతి ముంపు బారిన పడకుండా కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

==========================

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలపై ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆహారం, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఏలేరు జలాశయానికి వరద ముప్పు పొంచి ఉన్నందున ప్రభావితమయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్‌ను ఆదేశించారు. వర్షాల కారణంగా ఏలేరు జలాశయానికి వస్తున్న వరద నీటిని దిగువకు విడుదల చేయవలసి ఉంటుందని, ఆ నీరు పిఠాపురం, పెద్దాపురం వైపు మళ్ళుతుందని కలెక్టర్ తెలిపారు. దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి.. పిఠాపురం నియోజకవర్గంలోని ప్రజలను, రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. ముంపు గ్రామాల ప్రజలకు అవసరమైన ఆహారం, తాగు నీరు, ఔషధాలు పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులతో సమన్వయం చేసుకొని రైతాంగానికి, ప్రజలకి తగు సూచనలు చేయాలని పవన్ కళ్యాణ్ కలెక్టర్‌కు దిశానిర్దేశం చేశారు.

==========================

మహిళలు, బాలికల భద్రత దృష్ట్యా ప్రత్యేక ''ఉమెన్ సేఫ్టీ సెల్''ను అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా పోలీసు సూరింటెండెంట్ ఎం.దీపికలు పోలీస్ కార్యాలయంలో ప్రారంభించారు. మహిళలపై దాడులను అరికట్టి, వారి భద్రతకు భరోసా కల్పించేందుకు పోలీస్ స్టేషన్ కు అనుబంధంగా ఉమెన్ "సేఫ్టీ సెల్" పని చేస్తుందని ఎస్పీ తెలిపారు. విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే కార్యాలయాలు, ఇతర ప్రదేశాల్లో మహిళా పోలీసుల ద్వారా మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అనకాపల్లి జిల్లాలో మంత్రి, కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ లు మహిళలు కావడం విశేషమన్నారు. మహిళా చట్టాలైన పోక్సో యాక్ట్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గృహహింస తదితర చట్టాలపై ప్రచార వాహనం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.

==========================

వాయువ్య బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారులు తెలిపారు. రుతు పవనాల ద్రోణి ప్రస్తుతం జైసల్మేర్, కోటా, గుణ, సియోని, రామగుండం, కళింగపట్నం మీదుగా ప్రయాణిస్తూ.. సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందన్నారు. నిన్నటి ఉపరితల ఆవర్తనం కోస్తాంధ్ర ప్రాంతంలో సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉన్నట్టు వివరించారు. దీని ప్రభావంతో కోస్తాంధ్ర ప్రాంతంలోని చాలా చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఒకటి, రెండు చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఉపరితల గాలులు గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

విరామం

==========================

ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలోని ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్, క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విభాగాధిపతి శ్రీ సాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. క్యాజువల్ న్యూస్ రీడర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతో పాటు, తెలుగు, ఆంగ్ల భాషల్లో నైపుణ్యం, మంచి స్వరం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే రేడియో, టీవీ జర్నలిజంలో అనుభవం ఉండాలని, తెలుగు టైపింగ్ తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు ఈ పోస్టులకు ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదే విధంగా క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టుకు రెడియో ప్రొడక్షన్‌లో ఏదైనా డిగ్రీ, లేదా డిప్లమా అర్హత కలిగి ఉండాలని, తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. అలాగే ఆడియో రికార్డింగ్, ఎడిటింగ్‌లో అనుభవం ఉండాలని సూచించారు. ధరఖాస్తులను సిరిపురంలోని ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రానికి పోస్టల్ ద్వారా సెప్టెంబరు 6వ తేదీలోగా పంపించాలని కోరారు.

==========================

విశాఖకు పర్యాటకులను ఆకర్షించేలా విధానాలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈరోజు ఆయన జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... క్రూయిజ్ టూరిజానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ.. మెరుగైన వసతులు కల్పించాలని, ప్రత్యేక ప్యాకేజీలు రూపొందించాలని సూచించారు. పర్యటనలో భాగంగా భీమిలి పరిధిలోని పలు ప్రాంతాలను సందర్శించారు. అక్కడ నుంచి తొట్లకొండ చేరుకున్న ఆయన అక్కడి కట్టడాలను పరిశీలించారు.

==========================

రక్తహీనతను నియంత్రించేందుకు ముందుకు రావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. వీరఘట్టం మండలంలో పర్యటించిన ఆయన హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన మన బడి - మన తోట, సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జిల్లాలో రక్తహీనత నియంత్రణ లక్ష్యాన్ని చేరేందుకు ఆరోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. అనంతరం కలెక్టర్ వీరఘట్టం మండలం స్వయం సహాయక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “మహిళా మార్ట్”ను సందర్శించి, సభ్యులతో మాట్లాడి ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

==========================

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలంలో ఆధునీకరించిన మూడు పాఠశాల భవనాలను సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ఈరోజు ప్రారంభించారు. కొత్తవలస గ్రామంలో 2.8 లక్షల రూపాయలు, ఎస్. కొత్తూరులో 2.4 లక్షల రూపాయలు, వర్తనపల్లిలో 2.4 లక్షల రూపాయల ఖర్చుతో ఆధునీకరించిన పాఠశాల భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వంజంగి హిల్స్ పర్యాటక నిధులు 7.60 లక్షల రూపాయలతో ఆధునీకరణ కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. గత సంవత్సరం వంజంగికి 25 లక్షల రూపాయలు పర్యాటక ఆదాయం లభించిందని పేర్కొన్నారు. పర్యాటకం ద్వారా వచ్చిన ఆదాయంతో గ్రామాల్లో రహదారులు, పాఠశాల భవనాలు నిర్మిస్తున్నామని పివో తెలియజేశారు.

==========================

వరల్డ్ పవర్ లిఫ్టింగ్ లో విజయం సాధించి స్వదేశానికి వచ్చిన ఇద్దరు క్రీడాకారులకు అభిమానులు గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. మాల్టాలో జరిగిన జూనియర్ పవర్ లిఫ్టింగ్ వరల్డ్ ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్ గెలిచిన షేక్ సాదియా అల్మస్, 6వ స్థానం సాధించిన ఎం.షానున్ లకు బంధువులు, కే.యల్. యూనివర్సిటీ విద్యార్థులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా షేక్ సాదియా మాట్లాడుతూ... మంత్రి నారా లోకేష్ 3 లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందించారని, ఆయన ప్రోత్సాహంతో గోల్డ్ మెడల్ సాధించానని తెలిపారు.

==========================

పార్వతీపురం మన్యం జిల్లా ఐటిడిఏ గిరిమిత్ర సమావేశం మందిరంలో ఈ నెల 9వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ జాబ్ మేళాకు కేఎల్ గ్రూప్, అమెజాన్ సంస్థలు హాజరవుతాయని, 200 ఉద్యోగ నియామకాలను చేపట్టనుందని పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, ఇంగ్లీష్ చదవడంలో పరిజ్ఞానం ఉన్న యువతీ, యువకులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు.

==========================
==========================